ఈ కథ భారతదేశ చరిత్రలో 1857 నుండి 1947 వరకూ
సుమారుగా ఒక శతాబ్దంపాటు కొనసాగిన సంధికాలాన్ని
ఒక సాయింత్రంపూట ఇద్దరు వ్యక్తులమధ్య జరిగిన
సంభాషణలో పొందు పరచే ప్రయత్నం. సంధికాలాల అనిశ్చితి
మనుషుల్లో గందరగోళాన్ని సృష్టిస్తుంది. బహు కొద్దిమంది మాత్రమే
రాబోయే మార్పులను పసిగడతారు; వాటికోసం సంసిద్ధులవుతారు.

ఉణుదుర్తి సుధాకర్

# 1

# ఒక వీడ్కోలు సాయంత్రం

అక్బర్





జాన్ ఇంకా రాలేదు; చెన్నపట్నం మీదుగా స్టీమర్‌లో ఇంగ్లండు తిరుగు ప్రయాణానికి సర్దుకోవలసిన సామాన్లూ, చెయ్యాల్సిన ఏర్పాట్లూ ఇంకా చాలా ఉన్నాయనీ, అందుచేత ఆరోజు సాయంత్రం ఏడు గంటలకిగానీ క్లబ్బుకి చేరుకోలేననీ ముందుగానే చెప్పాడు. ఎర్రమట్టిదిబ్బల మీద పరుచుకున్న కోరమాండల్ క్లబ్బు, దొరలందరికీ స్థానిక జలాశయం. కేవలం దొరలకీ, రాజాలకీ, జమీందార్లకే కాకుండా తగిన స్థాయి కలిగిన ఇతర స్థానికులకు కూడా ప్రవేశం కల్పించవచ్చని క్లబ్బు యాజమాన్యం తీవ్రమైన అభ్యంతరాల్ని తోసిపుచ్చి ఇటీవలే తీర్మానించింది.

క్లబ్బు లాన్స్‌లో కూర్చుంటే సముద్రం స్పష్టంగా కనిపిస్తుంది, మంద్రంగా వినిపిస్తుంది. కెన్ క్లబ్బుకి చేరేటప్పటికి పడమటి ఆకాశం బాగా ఎర్రబడింది. తూర్పు వైపు నుండి సముద్రపు గాలి బలంగా వీస్తోంది- చల్లగా, కాస్తంత ఉప్పగా మధ్యాహ్నం పూట వేధించిన వేడినీ, ఉక్కనీ మృదువుగా మరపింపజేస్తూ. క్లబ్బు ఆవరణలోని కొబ్బరి, మామిడిచెట్ల మీద బంగారుఎండ తేనెరంగులోకి మారుతోంది. దూరంగా తీరం వెంట సరుగుడు తోటల వెనక ఇసుక తిన్నెలు రాగిరంగులో మెరుస్తున్నాయి. వాటికి నేపథ్యంగా గాఢనీలం లోంచి ఊదారంగుకి మారిన సముద్రం.

'ఇప్పుడు బాగానే ఉందిగాని, చీకటి పడ్డాక దోమలబాధ తప్పదు,' అనుకుంటూ లాన్స్‌లోకి నడిచాడు కెన్. తెల్లటి గుడ్డలు పరచిన గుండ్రటి టేకు మేజాలూ వాటిచుట్టూ పేర్చిన నాలుగేసి లేతాకుపచ్చరంగు పేముకుర్చీలూ ఇంకా ఖాళీగానే ఉన్నాయి. కాసేపట్లో సందడి మొదలవుతుంది. పేకాటరాయుళ్లూ, పీకలదాకా తాగేవాళ్లూ భవనం లోపలే కూర్చుంటారు గనక లాన్స్‌లో కాస్త ప్రశాంతంగానే ఉంటుంది. కుర్చీలన్నీ దాటుకుంటూ వెళ్లి ఒక మూల కూర్చున్నాడు కెన్, 'ఇక్కడైతే చీకట్లో ఎక్కువ మందికి కనిపించం,' అనుకుంటూ. ఇది జాన్‌కి తను వ్యక్తిగతంగా ఇస్తున్న వీడ్కోలు విందు, ఇంకెవర్నీ పిలవలేదు. పదింటికల్లా ముగించి బంగళాలకు బయిల్దేరాలని ముందుగానే ఒప్పందం కుదుర్చుకున్నారు.

పాగా, ఎర్రకోటూ, నీలం కమర్బంద్ ధరించిన బేరర్ పరుగెత్తుకుంటూ వచ్చి, వంగి సాయిబుల పద్ధతిలో సలాం చేసాడు.

"సింహాచలం! కైసా హై?" ఎన్నాళ్లయినా కెన్‌కి తెలుగు పట్టుబడలేదుగాని హిందుస్తానీతో నెట్టుకుపోగలడు.

నేటివ్స్‌తో కాస్త సఖ్యంగా ఉంటే వాళ్లు ప్రాణాలైనా ఇస్తారని ముప్ఫై ఏళ్ల ఇండియన్ సర్వీసు చివరి దశలో అతను గ్రహించాడు. ఈ గ్రహింపు వెనుక జాన్ ప్రభావం చాలానే ఉంది. అలాగని వాళ్లని నెత్తికెక్కించుకోకూడదు, ఇది మాత్రం ముందే తెలుసు.

కెన్ దొరంతటి వాడు తనని పేరుపెట్టి పిలిచినందుకు సంతోషం పట్టలేక పోయాడు సింహాచలం.

"అచ్ఛా హూ, సార్! క్యా లేంగే సార్?" అన్నాడు.

అందాకా తనకో బీరు, జాన్ రాగానే షాంపేన్, ఆ వెంటనే విస్కీ ఆర్డరు చేసాడు. దోమలు రాకుండా ధూపం వెలిగించమన్నాడు. సింహాచలం పరుగు తీసాడు. జాన్ దొర వొస్తున్నాడంటే అతనిలో ఉత్సాహం ఉప్పొంగింది. ఎప్పుడోగాని రాడు; వొచ్చినప్పుడల్లా అర్ధరూపాయికి తక్కువకాకుండా బక్షీష్ ఇస్తాడు. ఒక మాదిరిగానైనా తెలుగు మాట్లాడే దొర జాన్ ఒక్కడే.

పొగాకు దాచి మడతపెట్టిన తోలుసంచీ, పైపూ కోటుజేబులోంచి తీసి టేబుల్ మీద పరిచి పైపులో పొగాకు కూరడం మొదలుపెట్టాడు కెన్. ఇండియాలో ఉన్న ముప్ఫై ఏళ్లల్లో చాలామందికి స్వాగతాలు పలికాడు; వీడ్కోళ్లు చెప్పాడు. వచ్చే వాళ్లు సవాలక్ష సందేహాలతో జంకుతూ వస్తారు. వెళ్లేటప్పుడు ఆత్మవిశ్వాసంతో పొంగిన ఛాతీలతో, బరువైన డబ్బు సంచులతో వెళతారు. ఇంగ్లాండు తిరిగి వెళ్లిపోతున్నామనే ఉత్సాహం, ఇండియాను వీడిపోతున్న దిగులుని అధిగమిస్తుంది. భార్యలైతే మరీను; ఎగిరి గంతేసి వెళ్లిపోతారు. ఇంగ్లండులో నౌకర్లు ఉండరనేదొక్కటే వాళ్లకు దిగులు కలిగించే విషయం. జాన్ భార్యా, పిల్లలూ ఆరునెలల క్రిందటే వెళ్లిపోయారు. వాళ్ల ప్రయాణం కడుతున్నప్పుడు-

"ఏ విషయంలో ఇండియాని మీరు మిస్ అవుతారు?" అని కెన్ అడిగితే, జాన్ పిల్లలిద్దరూ తడుముకోకుండా,

"మామిడిపళ్లు," అని టపీమని జవాబు చెప్పారు. అప్పుడు వాళ్లని చూస్తే కెన్‌కి ముచ్చటేసింది.

ఇప్పుడు తలుచుకుంటూంటే- తనకి భార్యా, పిల్లలూ లేకపోవడం గుర్తుకొచ్చి బాధ కలిగిస్తోంది. అసలు తను ఇండియా వచ్చినప్పుడే ఐదు, పదేళ్లకన్నా ఎక్కువ

ఉండననుకున్నాడు. అలాటిది తనకన్నా తరవాత వచ్చిన వాళ్లంతా వెళ్లిపోయారు; వెళ్లిపోతున్నారు.

పాతికేళ్ల సర్వీసు దాటాక, 'ఇక్కడేం తక్కువ? చిన్న జమీందారులాగా బతుకుతున్నాను. ఇప్పుడు ఇంగ్లాండు వెళ్లి మాత్రం ఏం ఊడపొడవాలి?' అన్న ఆలోచన బలపడింది. బంగాళా చుట్టూ పెంచిన తోటన్నా, తనని విడిచి ఉండలేని కుక్కలన్నా అమితమైన ప్రేమ ఏర్పరచుకున్నాడు. ఒక ఆంగ్లో-ఇండియన్ టీచర్ దగ్గరైంది. ఇంకేం కావాలి? కానీ ఎక్కడో ఏదో అసంతృప్తి. ఎంతమంది వెళ్లిపోయినా ఏమంత అనిపించలేదుగానీ జాన్ వెళ్లిపోతాడంటే మనసుకి కష్టంగా ఉంది.

సింహాచలం గ్లాసులో పోసిన బీరు గుక్కెడు తాగి, గ్లాసు కిందపెట్టి పైపు వెలిగించాడు. చీకటవుతోంది. గాస్ దీపాలు వెలిగించారు. దోమలింకా రాలేదు. ధూపం పనిచేస్తున్నట్టుంది. పాతికేళ్లు ఇంగ్లండులోనూ, ముప్ఫైఏళ్లు ఇండియాలోనూ గడిపాడు. ఏది తన స్వదేశం? ఇక్కడేపోతే ఏ వాల్తేరు సెమెట్రీలోనో పాతిపెడతారు. ఎక్కడయితే నేం? చివరికి మట్టిలో కలిసిపోవడమే కదా? ఛ... ఛ... ఎందుకిలా ఆలోచిస్తున్నాడు?

తను ఇలా దిగాలుగా ఉన్నప్పుడు ఎన్నిసార్లు తన అంతులేని ఉత్సాహంతో, సునిశితమైన హాస్యంతో జాన్ తనని పైకి లాగాడు? జాన్‌కి ఆసక్తిలేని విషయమేదీ లేదనిపిస్తుంది. ఎన్నో విషయాల గురించి మాట్లాడతాడు. తెగ చదువుతాడు. ఏవేవో కొత్త వార్తలు, సంగతులు చెబుతూనే ఉంటాడు. అలాగని ఎవరి గురించీ చెడ్డగా చెప్పడు. టెన్నిస్, క్రికెట్ ఆడతాడు. మంచి కార్యదక్షుడిగా పేరు పొందాడు. అతనికింకా పదేళ్లు సర్వీసుంది. అనుకోకుండా లండన్‌లోని ఇండియా ఆఫీసులో ఉపకార్యదర్శిగా చేరమని ఉత్తర్వు వచ్చింది. అంటే రిటైరయ్యేనాటికి చాలా పెద్ద పొజిషన్‌లోకి వస్తాడు. అలాంటి అరుదైన స్నేహితుడు వెళ్లిపోతున్నాడు.

పైపు ఆరిపోయింది. కోటు లోపలి జేబులోంచి గొలుసు గడియారం తీసి చూసాడు. ఏడు దాటింది. కొన్ని టేబుళ్ల చుట్టూ జనం చేరారు. పకపకా నవ్వులు వినిపిస్తున్నాయి. దోమలు కుడుతున్నాయి. కెన్‌కి చిరాగ్గా ఉంది. ఆరిన పైపుని టేబిల్ మీద విదిలించి కొట్టాడు. బూడిద బయటకొచ్చి తెల్లటి టేబిల్ క్లాత్‌ని పాడుచేసింది. అతని చిరాకు ఇంకా ఎక్కువైంది. అటుగా వెళ్తున్న ఒక బేరర్‌ని కసిరినట్టుగా పిలిచి మరో బీరు తీసుకురమ్మన్నాడు. సేవకుల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై జాన్ నేర్పిన పాఠాలు రెండే రెండు గ్లాసుల బీరుతో ఎటో ఎగిరిపోయాయి.

ఈరోజు అతనికెందుకో జెన్నిఫర్ జ్ఞాపకం వస్తోంది. ఇరవై ఏళ్ల కిందటి మాట... లేక ఇంకా ఎక్కువే అయిందా? ఇప్పుడు తగ్గిపోయిందిగాని అప్పట్లో ప్రతీ ఏడూ చలికాలపు రోజుల్లో, అంటే క్రిస్టమస్ సెలవుల్లో పెళ్లికొడుకుల్ని వెతుక్కుంటూ ఇంగ్లండు నుండి యువతుల బృందాలు తరలి వచ్చేవి. వాళ్లని 'గేలం యువతులు'

అనేవాళ్లు. కలకత్తా, బొంబాయి, ఢిల్లీ, సిమ్లా ఈ ప్రదేశాలన్నీ చుట్టబెట్టేవాళ్లు. కొన్ని గేలాలకి చేపలు పడేవి; లేదంటే సరదాగా సెలవులు గడిపేసి ఎండలు ముదిరేలోగా తిరిగివెళ్లిపోయేవారు. జెన్నిఫర్ కూడా అలాగే వచ్చింది. ఇక్కడే, ఈ క్లబ్బులోనే నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. అర్ధరాత్రి వరకూ సంగీతం, డాన్సులు, నవ్వులు, కేరింతలు... అదంతా ఓ కలలా అనిపిస్తోంది. అదే రోజున ప్రపోజ్ చేద్దామనుకుంటూ ఎందుకో జంకాడు. చేసి ఉంటే ఎలాఉండేదో? వాళ్లిద్దరి మధ్యా ఏదో ఉందని అందరూ అనుకున్నారు.

ఆమె జాన్‌కి కజిన్. వాళ్లింట్లోనే దిగింది. వేసవిలో తనని లండన్ రమ్మంది, ఉత్తరాలు రాస్తానంది. ఎందుకోగాని మనసు మార్చుకుంది. తను రాసిన ఉత్తరాలకి జవాబివ్వలేదు. ముడిపడుతున్న బంధాన్ని చేతులారా ఎందుకు తెంచింది? జాన్‌ని అడుగుదామని చాలాసార్లు అనుకున్నాడుగాని, తీరా అడిగితే ఏ చేదునిజం చెబుతాడో అని ఊరుకున్నాడు. ఆమె నవ్వినప్పుడు బుగ్గమీదపడే సొట్ట, న్యూ ఇయర్ పార్టీ నాడు ఆమె వేసుకున్న ఎర్ర ముఖమల్ గౌను, అదే ఎరుపు లిప్‌స్టిక్, మెడలో మెరిసే ముత్యాలపేట కళ్లకి కట్టినట్టుగా గుర్తొస్తున్నాయి. మర్చిపోయినవి అనుకున్న సంగతులు మస్తిష్కపు మారుమూలల్లో దాగి ఉంటాయి కాబోలు; ఎప్పుడెప్పుడో ఉబికివస్తాయి. అలా వచ్చినప్పుడల్లా కొత్తకొత్త రంగులు పులుముకొని మరీ వస్తాయి. గతానికి వర్తమానం చేసే అలంకరణ అది. జెన్నిఫర్ ఇప్పుడెలా ఉందో? ఒకే ఒకసారి మాటల సందర్భంలో జాన్ ఆమె ప్రసక్తి తీసుకొచ్చాడు- పెళ్లి చేసుకొని గ్లాస్గోలో స్థిరపడిందని చెప్పాడు.

చీకట్లో ఎట్నుంచి ఊడిపడ్డాడోగాని, "సారీ, ఆలస్యం అయింది," అంటూ చటుక్కున వచ్చి కూర్చున్నాడు జాన్, తన ఉత్సాహభరితమైన చిరునవ్వుతో.

"ఏడుకే క్లబ్బుకి చేరానుగాని రిసెప్షన్ దగ్గర ఎప్పట్నించో కలవాలనుకుంటున్న ఒక ప్రముఖ వ్యక్తిని ఒకాయన పరిచయం చేశాడు. నాలుగు ముక్కలు మాట్లాడే సరికి ఆలస్యం అయింది."

"ఎవరా వ్యక్తి?"

"మనం ఎప్పటి నుంచో వింటూన్న పేరే. సర్ ఆర్థర్,"

"ఆ!? సర్ ఆర్థర్ కాటనే?!"

"ఆహా, ఆయనే!"

"ఏమంటాడు?"

"టూకీగా చెబుతాను. బ్రిటీష్ పాలనకు గుర్తుగా చిరకాలం మిగిలిపోయే ఉత్తమ చిహ్నాల గురించి సంభాషణ సాగుతోంది. సీనియర్ రైల్వే అధికారి ఒకాయన- శాశ్వతంగా ఈ దేశంలో నిలిచిపోయేది భారతీయ రైల్వేవ్యవస్థ మాత్రమే అన్నాడు."

"అలా అంటే కాటన్ మహాశయుడు ఒప్పుకోడే?"

"అవును మరి. జవాబుగా సర్ ఆర్థర్ రైల్వేలమీద పెడుతున్న ఖర్చులో పదో వంతు నీటిపారుదల, జలరవాణాల మీద పెడితే ఇంకా గొప్ప ప్రయోజనాలను ఈ దేశస్థులు పొంది ఉండేవారన్నాడు. ఈ దేశపు అపార జలసంపదని సద్వినియోగం చేసి లక్షల మందిని కరువుల నుండి ఎలా శాశ్వతంగా విముక్తులను చెయ్యవచ్చో చెప్పాడు. రైల్వేలు అవసరమేగాని పంటభూములకు నీరు అందించడం పాలకుల మొదటి కర్తవ్యం అన్నాడు. భారతదేశ పాలకులు ప్రాచీనకాలం నుండీ ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ వస్తున్నారన్నాడు."

"ఇదే అతని వాదన, ఎప్పట్నించో," అన్నాడు కెన్.

"ఈరోజున తన వాదనని హేతుబద్ధంగానే కాకుండా భావోద్వేగంతో కూడా వినిపింపజేశాడు. తక్షణ లాభనష్టాల బేరీజుకన్నా దీర్ఘకాలిక ప్రయోజనాలు, ప్రాణాల్ని కాపాడడం ముఖ్యం అన్నాడు. ఈ దృష్టి లేకపోతే భగవంతుడు పాలకులను క్షమించడన్నాడు. అతనికి హృదయానికి చాలా దగ్గరగా ఉండే ప్రతిపాదన ఈ దేశపు నదుల్ని అనుసంధించే పథకం గురించి చెప్పాడు. ముసలాడి ఉత్సాహం చూస్తే ముచ్చటేసింది."

"పదవీ విరమణ చేసి ఇంగ్లండు వెళ్లిపోయాడని విన్నాను?"

"నిజమే. ప్రభుత్వం వారి పిలుపు మీద సలహాదారుడిగా ఈమధ్యనే తిరిగి వచ్చాడు. కుంఫిణీపాలన ముగిసి ప్రత్యక్ష బ్రిటీష్ ప్రభుత్వ పాలన ఏర్పడింది గనక, ఇటువంటి నిపుణుల సలహాలతో ఇకమీదట పెద్దపెద్ద పథకాలు అమలు కాబోతున్నాయనే ఆశాభావం పెరుగుతోంది."

"ఈరోజున సర్ ఆర్థర్ వస్తున్నట్టు క్లబ్బువాళ్లు ముందుగా చెప్పలేదే?... ఒట్టి పనికిమాలిన సజ్జు," అన్నాడు కెన్ చిరాగ్గా.

"టౌన్ హాల్లో ఆయనకి సన్మానం జరిగింది. ఆ విషయం నాకూ తెలుసుగాని వెళ్లడం కుదరలేదు. నీక్కూడా ఆహ్వానం వచ్చి ఉండాలే? డిన్నర్‌కని ఇక్కడికి తీసుకొచ్చినట్టున్నారు. నేను కలిసినప్పటికే భోజనాలు ముగించి బయిల్దేరిపోతున్నారు."

సర్ ఆర్థర్ లాంటి మహానుభావుడిని కలుసుకొనే అవకాశం చేజారిపోయినందుకు కెన్ మనసు అసంతృప్తితో నిండిపోయింది. అది గ్రహించిన జాన్-

"ఇంకా కొన్నాళ్లు ఉంటాడులే. విశాఖపట్నం పోర్టు పథకం ముందుకెళ్లేటట్టుగా ఉంది. దానికి మరి ఈయనే ఆద్యుడు కదా. ఇరవై ఏళ్ల కిందట సర్ ఆర్థర్ ఇక్కడే యారాడ కొండమీద కుటుంబంతో సహా రెండేళ్లున్నాడు- నువ్వు వినే ఉంటావు. అప్పుడే పోర్టు నిర్మాణానికి ప్రతిపాదన చేసాడుగాని నిధులు లేక కుంఫిణీ అధికారులు దాన్ని పక్కన పెట్టారు."

“బ్రిటిష్ పాలనకు గుర్తులు అన్నావు. అంటే మనం ఇక్కడి నుంచి వెళ్లిపోయే పరిస్థితి రావచ్చునంటావా?” ఈ ఊహకందని పరిణామం కెన్‌ని కంగారుపెట్టింది. తన కుక్కలూ, బంగళా, తోటా, సహచరీ జ్ఞాపకం వచ్చాయి అదే క్రమంలో.

“ఇప్పట్లో కాదులే. నువ్వూ నేనూ ఆ రోజు చూడంగాని, ఎప్పుడో వస్తుంది. తప్పదు.”

కెన్ కాస్త ఊపిరి పీల్చుకుని, “ఇంగ్లీషుపాలనలో లేని భారతదేశం!.... ఊహకే అందడం లేదు,” అన్నాడు.

సింహాచలం వచ్చి షాంపేన్ సీసాని కెన్‌కి అందజేశాడు. పొగాకు బూడిదని తుడిచి, వైన్ గ్లాసుల్ని, వేయించిన చేపముక్కల్ని టేబిల్ మీద సర్ది వెళ్లిపోయాడు. కెన్ స్వయంగా బిరడా తీసి, ఇద్దరి గ్లాసుల్లోనూ పోసాడు.

“ఛీర్స్! భారతదేశంలో నీ అద్భుత అనుభవాల్ని గుర్తు చేసుకుంటూ, ఇంగ్లండులో మరిన్ని ఘనవిజయాల్ని సాధించాలని కోరుకుంటూ!”

ఇద్దరి మధ్యా కాసేపు నిశ్శబ్దం. బీరు, షాంపేన్, విస్కీ కలగలిసిపోయి కెన్ లోలోపల గందరగోళం సృష్టిస్తున్నాయి. దూరంగా సముద్రపు హోరు. ‘మనం ఇక్కడ లేకపోవడం,’ అన్న ఆలోచనే అతనికి ఇబ్బందికరంగా, చిరాగ్గా ఉంది.

“మనం వెళ్లిపోయే పరిస్థితి వస్తుందని ఎందుకనుకుంటున్నావు జాన్?”

“1857లో ఏమైందో చూశాం. చావు తప్పి కన్ను లొట్టపోయింది. కేవలం లాభార్జన కోసం ఏర్పడ్డ కుంఫిణీ మాదిరిగా కాకుండా బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా వ్యవహరించవలసిన రోజులొచ్చాయి. లేకపోతే ఇక్కడ మనం కొనసాగడానికి జనామోదం ఉండబోదు. వీళ్లుగాని తిరగబడితే మనం చెయ్యగలిగేది ఏమీలేదు. ఈమధ్య ఇంగ్లీషు చదువులు, ముఖ్యంగా ఇంగ్లండు వెళ్లి చదువుకొని తిరిగిరావడం ఎక్కువైంది. వాళ్లంతా ఎక్కువగా మధ్యతరగతి, లేదా ఉన్నతవర్గ, అగ్రవర్ణ లాయర్లు, ఉపాధ్యాయులు; ఇంగ్లీషు చక్కగా మాట్లేడేవాళ్లు, రాసేవాళ్లూను. మనకి అత్యంత ప్రమాదకరమైన సమూహం ఇదే!”

కొంతమంది నేటివ్ లాయర్లు, ఉపాధ్యాయులు ఒక మూల గుమిగూడి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని అంతమొందించేందుకు మంతనాలు చేస్తున్నారని ఊహించుకుంటే కెన్‌కి నవ్వొచ్చింది. ఈ మాటలంటున్నది జాన్ గనక నవ్వకుండా శ్రద్ధగా వింటున్నాడు.

“వీళ్ల నాయకత్వంలోనే రాబోయే కాలపు తిరుగుబాట్లు పుట్టుకొస్తాయి; సిపాయిల్లోంచి కాదు. వీళ్లని ఎదుర్కోవడానికి కొత్త ఎత్తుగడలు అవసరం. వాళ్లకన్నా తొందరగా నేర్చుకుంటే తప్ప వాళ్లని ఎదుర్కోలేం.”

"పాతిక ముప్పైఏళ్ల నుంచి ఇక్కడ పనిచేస్తున్నాం. సుమారు వందేళ్లుగా ఈ దేశాన్ని నియంత్రిస్తున్నాం. ఇప్పుడు కొత్తగా నేర్చుకొనేదేముంది?"

"ఇక్కడికి వచ్చే అధికారులకు కుంఫిణీవారు ఇస్తూ వచ్చిన తర్ఫీదు ఇంకెంత మాత్రమూ సరిపోదనన్నీ, ఇండియన్ సివిల్ సర్వీస్ అనే కొత్త విభాగాన్ని ఏర్పరచాలనీ 1858లో తీసుకున్న నిర్ణయాల్ని హుటాహుటిన అమలు చేస్తున్నారు. ఈ కొత్త కాడర్‌ని నిర్మించేందుకూ, మరోవైపు గూఢచారవ్యవస్థని పటిష్టం చేసేందుకూ చాలామందిని ఢిల్లీలోనూ, లండన్‌లోనూ కొన్ని ప్రత్యేక విభాగాల్లో నియమిస్తున్నారు. ఇప్పుడు నాకు అప్పగించిన బాధ్యతలు కూడా ఇలాంటివే."

ఒక్క క్షణంలో కెన్‌కి మొత్తం అంతా అర్థమైపోయింది. కాని ఒక సందేహం అతన్ని పీడిస్తోంది.

"మనం లేకపోతే ఈ దేశం ముప్పైమూడు చెక్కలవుతుంది," అన్నాడు కొంచెం అలకతో కూడిన స్వరంతో.

"నిజమే. మన పాలన లేకపోతే ఈ దేశపు లోలోపలి సంఘర్షణలు, వాటితో బాటు మధ్యయుగ అవలక్షణాలు బయటపడతాయి. అయితే రైల్వేలు, టెలిగ్రఫీ, విద్యా, న్యాయవ్యవస్థలు- ఇవే దీర్ఘకాలిక ప్రగతికి మనం ఏర్పరచిన మార్గాలు. గమ్మత్తేమిటంటే ఇవే రేప్పొద్దున్న మన పీకలకు చుట్టుకుంటాయి."

కెన్ కిక్కు కొంచెం దిగింది. ఆసక్తిగా వింటున్నాడు. సింహాచలం ఆఖరి రౌండు విస్కీ, సలాడ్, చికెన్ బిరియానీ తీసుకొచ్చి పేర్చాడు.

జాన్ చెప్పుకుంటూ పోతున్నాడు.

"ఈమధ్య ఒక నివేదిక చదివాను. దాంట్లో ఒక పాత్రికేయుడు- పేరు గుర్తు రావడం లేదు- 1857నాటి సంఘటనల గురించి రాస్తూ, 'తిరుగుబాటు విఫలమైంది గాని బ్రిటిష్ వారు ప్రవేశపెడుతూన్న రైల్వేలే వారి కొంపముంచుతాయి. అన్ని కులాల వాళ్లూ రైళ్లల్లో కలసికట్టుగా ప్రయాణిస్తారు. క్రమేపీ వారిమధ్య విభేదాలు తొలగి పోతాయి...' ఈ ధోరణిలో. విడ్డూరంగా అనిపించినా దీంట్లో కొంత నిజం ఉంది."

కెన్ ఇక తమాయించుకోలేకపోయాడు. "రైళ్లల్లో కలసి ప్రయాణిస్తే కులవ్యవస్థ అంతం కావడమేమిటి? ఎవడా రాసింది?"

"ఎవరో జర్మన్ అనుకుంటా. మొదటిసారిగా మనం ఈ దేశపు ప్రజలు, ప్రాంతాలు చేరువకాగల అవకాశాల్ని సృష్టించామన్నది మాత్రం వాస్తవం."

"ఇదంతా సరేగాని జాన్, మళ్లీ తిరిగి ఎప్పుడొస్తావు?" అనడిగాడు కెన్- సంభాషణని మరో దిశలోకి మళ్లిస్తూ.

"ఏమో? ప్రభుత్వంవారు పంపితేనే."

''ఈ దేశం వదిలి వెళ్లాలంటే నీకేమనిపిస్తోంది?''

''నేనిక్కడికి వచ్చినప్పటి రోజులు గుర్తుకొస్తున్నాయి. బంగాళాఖాతం, అరేబియన్ సముద్రం, హిందూ మహాసముద్రం, హిమాలయా పర్వతాలు, గంగానది, వారణాసి, పాటలీపుత్రం, కపిలవస్తు, మలబార్, కోరమాండల్- ఈ పేర్లలోనే గొప్ప చరిత్ర, సాహసకృత్యాలు, రొమాన్సు దాగి ఉన్నట్లు అనిపించేది. ఇప్పటికీ ఆ భావన అలాగే ఉంది. మా అబ్బాయి ఈమధ్య రాసిన ఉత్తరంలో ఒక మంచి మాటన్నాడు. ఒక దేశం పేరున ఉన్న ఏకైక మహాసముద్రం ఇండియన్ ఓషన్ అని. నిజమే కదా అనిపించింది.''

''ఇప్పుడేమనిపిస్తోంది?''

''ఇప్పుడా? భారతదేశంలో ఇన్నాళ్లు పనిచేయడం నాకు లభించిన గొప్ప అవకాశం అనిపిస్తోంది. ఇది నా జీవితకాలపు గొప్ప అనుభవం. దీన్ని ఆధారంగా చేసుకొని ఇక్కడి ప్రజల కోసం చెయ్యగలిగిన మంచిపనులేమైనా చెయ్యాలనేదే నా కోరిక. ఇవాళ అనుకోకుండా సర్ ఆర్థర్‌ని కలుసుకున్నాక ఇలాగని మరీ బలంగా అనిపిస్తున్నది. నేనీ క్లబ్బుకి వచ్చిన ఆఖరిరోజున ఆయన తటస్థపడడం దైవసంకల్పం కావచ్చు.''

కాసేపు మౌనంగా బిరియానీ తిన్నారు. భావోద్వేగంతో మాట్లాడడం జాన్ పద్ధతి కాదు. ఈరోజు మాత్రం అతనిలో ఎక్కడో దాగిన ఉద్వేగస్వరాలు వినిపించాయి కెన్ చెవులకి.

జాన్‌కి కూడా అలా అనిపించిందేమో. ''నేనిక బయిల్దేరాలి,'' అని ఏకపక్షంగా, ముక్తసరిగా ప్రకటించి, లేచి నిటారుగా నిలబడ్డాడు. అర్ధరాత్రి దాటితేగాని కెన్ క్లబ్బు నుండి కదలడని జాన్‌కి తెలుసు. అయిష్టంగానే కెన్ కూడా లేచాడు; లేవగానే ఒకింత తూలాడు. కుర్చీని పట్టుకొని సంబాళించుకుని అడుగు ముందుకేసాడు. క్లబ్బు గేటు వైపు నడుస్తున్నారు. నిండు పున్నమి వెన్నెల. పాదాల క్రింద ఎండుపుల్లలు విరుగుతున్నాయి.

సింహాచలం పరుగెత్తుకుంటూ వచ్చాడు. ''దొరగారు పైపు మర్చిపోయారు,'' అని కెన్‌కి అందజేశాడు. ''గుడ్ నైట్ సార్!'' అన్నాడు వంగి సలాం చేస్తూ. జాన్ ఒక వెండి జడ రూపాయి- విక్టోరియారాణి బొమ్మ ఉన్నది- సింహాచలం చేతిలో పెట్టాడు. అతను సలాం చేసి వెళ్లిపోయాడు.

స్నేహితులిద్దరూ ముందుకి నడిచారు. కీచురాళ్ల రొద; వాటి వెనుక తరంగ ఘోష. రెండు కెరటాల తాకిడి మధ్య నెలకొన్న కొద్దిక్షణాల ఉద్రిక్త నిశ్శబ్దం. ఆ తరవాత మళ్లీ కెరటం విరిగిన సంరంభం.

"నేనొకటి అడుగుతాను, చెబుతావా?" అన్నాడు కెన్.

"అడుగు."

"జెన్నిఫర్ ఎందుకు మనసు మార్చుకుంది? నీకేమైనా చెప్పిందా?"

"నేనే ఆమెకు చెప్పాను. మీ ఇద్దరికీ జోడీ కుదరదని. నాకలా అనిపించింది మరి అప్పట్లో."

కెన్ ఇంకేమీ అనలేదు. గేటు సమీపించారు. వీళ్ల రాకని గమనించిన జట్కా గుర్రం తలాడించి సకిలించింది. జట్కా సాయిబు ఉలిక్కిపడి నిద్రలేచాడు.

*సారంగ అంతర్జాల పత్రిక*
*13 జనవరి 2016*

---

*వివరణలు*

1. ఆర్థర్ కాటన్ 1860లో పదవీవిరమణ చేసి ఇంగ్లండ్ వెళ్లిపోయాడు. బ్రిటిష్ ప్రభుత్వం కోరికపై 1863లో తిరిగివచ్చి సుమారు ఏడాదిపాటు ఉన్నాడుగాని ఆ వ్యవధిలో మళ్లీ విశాఖపట్నం వచ్చిన దాఖలాలు లేవు. ఆ రాక కథ కోసం సృష్టించబడింది.
2. 1863లోనే ఇండియన్ సివిల్ సర్వీస్‌లో చేరే అర్హతను సాధించిన మొట్టమొదటి భారతీయుడు రవీంద్రనాథ్ టాగోర్ అన్నగారైన సత్యేంద్రనాథ్ టాగోర్. రెండవ వ్యక్తి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన రొమేష్ చంద్ర దత్. మూడవది బ్రహ్మోసమాజ్‌లో చేరిన బిహారిలాల్ గుప్తా. నాలుగవ వ్యక్తి సురేంద్రనాథ్ బెనర్జీ. ఐ.సీ.ఎస్. అర్హతను సాధించిన భారతీయులందరిలో అత్యంత సుప్రసిద్ధుడు సుభాష్ చంద్ర బోస్.
3. ఈ కథలో జాన్ మర్చిపోయిన జర్మన్ పాత్రికేయుని పేరు కారల్ మార్క్స్.

*



13 మార్చి 1954న పుట్టిన ఉణుదుర్తి సుధాకర్ మొదటి కథ **తారుమారు** 24 జులై 1994న ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో అచ్చయ్యింది. ఇప్పటివరకూ పన్నెండు కథలు రాశారు.

*చిరునామా: సి-804, అపర్ణా సరోవర్ గ్రాండ్, నల్లగండ్ల,*
*హైదరాబాద్ - 500 019 ఫోన్: 90006 01068*
**sudhakarudu@gmail.com**